రెండో రోజూ 'పది' పరీక్షలు ప్రశాంతం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 19: పదో తరగతి పరీక్షలు రెండో రోజూ ప్రశాంతంగా జరిగాయి. రెగ్యులర్ విద్యార్థులు 12,331 మందికి గాను 12,275 మంది హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిశీలకుడు పి.మధన్‌మోహన్ 5 సెంటర్లను, డీఈవో వెంకటేశ్వరచారి 6 సెంటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 30 సెంటర్లను పరిశీలించారు. మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని, ప్రైవేట్ విద్యార్థులు ఆరుగురికి గాను ఐదుగురు హాజరై పరీక్ష రాశారని డీఈవో పేర్కొన్నారు.

గోదావరి తీరంలో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మణుగూరు టౌన్, మార్చి 19: మణుగూరు శివారులోని రామానుజవరం పంచాయతీ కొండాయిగూడెం గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను మంగళవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానులకు జరిమానా విధించారు.

బీఆర్ఎస్ కార్యకర్త మృతి

కరకగూడెం, మార్చి19: రఘునాథపాలేనికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తంతనపల్లి సత్యనారాయణ (49) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకులు మృతుడి ఇంటికి వచ్చి నివాళి అర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు సత్యమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

అన్నపురెడ్డిపల్లి, మార్చి 19: మండలంలోని జానకీపురం సత్యమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు, బోనాలు, అష్టోత్తర కుంకుమ పూజలు, మంత్రపుష్ప నీరాజనాలు, గ్రామోత్సవాలు, మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సింగరేణి క్రీడాకారులకు కబడ్డీ శిక్షణ శిబిరం

క్రీడాకారుల కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధికా

మణుగూరు టౌన్, మార్చి19: సింగరేణి పరిధిలోని అన్ని ఏరియాలకు చెందిన కబడ్డీ క్రీడాకారుల కోసం యాజమాన్యం మణుగూరు ఏరియాలో శిక్షణా శిబిరం నిర్వహించాలని నిర్ణయించింది. మంగళవారం క్రీడా శిబిరాన్ని ఎస్పీటూ జీఎం వీసం కృష్ణయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సలగల రమేష్, ఏజీఎం (సివిల్) డి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ జాన్‌వెస్లీ, కబడ్డీ శిక్షకులు మురుగదాస్ పాల్గొన్నారు.

ఎస్‌జేకే అహ్మద్ సేవలు అభినందనీయం: సజ్జనార్

పాల్వంచ, మార్చి 19: పాల్వంచ నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు అహ్మద్ సేవలు అభినందనీయమని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో అహ్మద్‌ను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరోనా కాలంలో పేదలను అహ్మద్ ఆదుకున్న తీరును ప్రశంసనీయమైనదని అన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి: జీఎం

ఇల్లెందు రూరల్, మార్చి 19 : నిరుద్యోగ యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30 వరకు శిక్షణ గడువును పెంచామన్నారు. 38 వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. కాస్మోటాలజీ, డ్రోన్, సోలార్, సెల్ టెక్నీషియన్స్, టూవీలర్ మెకానిక్, ఆర్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ తదితర కోర్సులు ఉన్నాయన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 20మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యువత ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకొని ఎంవీటీసీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

'ఆదివాసీలు ఐక్యతను చాటాలి'

ఇల్లెందు/ ఇల్లెందు రూరల్, మార్చి 19 : ఆదివాసీలందరూ ఐకత్యను చాటాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు అన్నారు. ఏహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఇల్లెందులో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంటు స్థానంలో ఆదివాసీ బిడ్డ అరుణ్‌ను నిలబెడతామని అన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేట, మార్చి 19: కోడి పందేల స్థావరంపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. పాపిడిగూడెం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్సై శ్రీరాముల శ్రీను తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ నుంచి రెండు సెల్‌ఫోన్లు, రెండు పందెం కోడి పుంజులు, ఒక బైకు, రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది పరారయ్యారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అశ్వాపురంలో 1.38 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

అశ్వాపురం, మార్చి 19: ఏపీలోని చింతూరు నుంచి కారులో మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న నిందితులను అశ్వాపురం పోలీసులు పట్టుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. కారులో గంజాయి తరలుతున్నదని సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి గొల్లగూడెంలో కాపు గాశారు. ఈ క్రమంలో అటుగా వస్తున్న కారును ఆపి సోదా చేశారు. అందులోని 1.38 క్వింటాళ్ల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.34 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
HOUSE FOR SALE
★పాత పాల్వంచ మెయిన్ రోడ్డుకు దగ్గరలో 480 చ॥గ॥లలో డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు, స్థలం, తూర్పు ఫేసింగ్, రిజిస్ట్రేషన్ కలిగినది అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్ర॥ 9849419886
KMM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

PUBLIC NOTICE
Under the instructions of my client M/S Shriram Finance Ltd, **KOTHAGUDEM** Branch Rep. by its Branch Manager it is stated that **Sri Kesa Veera Venkata Srinivas** S/o.Venkata Rao, Aged : 46 Years, **Occ:** Business, **R/o.** H.No. 14-1-253, KSP Road, Palvancha Village and Mandal, Bhadradri Kothagudem District is creating mortgage against his property shown below as security for the proposed trade Loan. If anybody having any objection they can send the objections to me or to my client within **5** days from the date of publication of this notice and further objections if any shall not bind my client.
PROPERTY TO BE MORTGAGED
Open site Plot No.35 of an extent of 204 Sq.yards admeasuring Sy.No. 817/2, 817/2/2, situated at Srinivasa Colony, Palvancha Village and Mandal, Bhadradri Kothagudem bounded by : **EAST :** 30 ft Rood, **WEST:** My own Land, **NORTH :** Plot No.36, **SOUTH :** Plot No. 34.
PALIVELA GANESH BABU
Advocate, Kothagudem, Bhadradri Kothagudem Dist.,Cell:9849246278
Kothagudem Dt:17.03.2024

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

- గతంలో ట్రక్కు ఇసుక ధర రూ.2 వేల నుంచి రూ.3 వేలు
- ప్రస్తుతం రూ.6 వేల - రూ.7 వేలు
- ధరలతో నిర్మాణ రంగం కుదేలు
- ఇళ్ల యజమానులకు ఇబ్బందులు
- వెంటనే సర్కార్ ఇసుక పాలసీని ప్రకటించాలని డిమాండ్

ఇల్లెందులోని ఇసుక నిల్వలు

ఇసుకే బంగారమాయే..!

ఇల్లెందు రూరల్, మార్చి 19: 'ఇల్లు కట్టి చూడు.. పెండ్లి చేసిచూడు' అన్నారు పెద్దలు. అంటే ఆ రెండు విజయవంతంగా పూర్తి చేయడం అంతకష్టమని పెద్దల భావన. ప్రస్తుత పరిస్థితుల్లో పెండ్లి చేయడం సులభమేమో గానీ ఇల్లు కట్టడం మాత్రం కష్టతరంగానే ఉంది. అందుకు ప్రధాన కారణం డిమాండ్ తగినంత ఇసుక లభించకపోవడమే. భద్రాద్రి జిల్లాలో ప్రస్తుతం ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే సులభంగా దొరికే ఇసుక ఇప్పుడు ఏ విధంగా ప్రయత్నించినా దొరకని దుస్థితి. దీనిని అదునుగా తీసుకున్న దళారులు సిండికేట్‌గా మారి ఇసుక ధరలను అమాంతం పెంచేస్తున్నారు. దీంతో ఇంటి యజమానులు ఇల్లు కట్టాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. ఇసుక కొరత భవన నిర్మాణ కార్మికులపైనా పడుతున్నది. పనులు సక్రమంగా సాగక వారి ఉపాధి దెబ్బతింటున్నది.

ధరలు ఇలా..

గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.2వేల నుంచి రూ.3 వేల లోపు ఉండేది. కానీ ఇప్పుడు అక్రమార్కులు ట్రాక్టర్ ఇసుకను రూ.6 వేల నుంచి రూ.7 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పెరిగిన ధరలతో ఇంటి యజమానులపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అదనపు భారం పడుతున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో సర్కారే ఇసుక విక్రయాలను నియంత్రించేంది. ఎవరికైనా ఇసుక కావాలంటే ఆన్‌లైన్ బుక్ చేసుకుంటూ రెవెన్యూశాఖ అధికారులు అప్రూవల్ ఇచ్చేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇసుక పాలసీని రూపొందించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొందరు ఇంటి యజమానులు మాత్రం ఎలాగో నిర్మాణం మొదలుపెట్టాం.. ఇక ఎక్కువ ధరకైనా ఇసుక కొని పూర్తి చేద్దామనుకుంటున్నారు. దళారులను ఆశ్రయించి సుదూర ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తెప్పించుకుంటున్నారు. మరికొందరు నాసిరకం ఇసుకను కొనుగోలు చేసి నష్టపోతున్నారు. సాధారణంగా ఇల్లెందు నియోజకవర్గంలో ఇల్లు నిర్మించాలంటే ఇంటి యజమానులు టేకులపల్లి, కాచనపల్లి, గుండాలలోని స్థానిక రీచ్‌ల నుంచి ఇసుక తెప్పించుకునేవారు. కానీ ఇప్పుడు కిన్నెరసాని, భద్రాచలం నుంచి అధిక రేట్లకు తెప్పించుకోవాల్సిన పరిస్థితి. ఇసుకను కొనుగోలు చేయలేని పేదలు ఇప్పుడు కట్టడాలకు రాయిపొడి (డస్ట్) వాడుతున్నారు. దీంతో నిర్మాణం వ్యయం తగ్గుతుంది కానీ ఇల్లు పదికాలాల పాటు నిలువడం సాధ్యం కాదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి దళారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి, ఇసుక పాలసీ రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక కొనలేకపోతున్నాం..

ఇంటి నిర్మాణానికి ఇసుక తప్పనిసరి. మా కుటుంబం ప్రస్తుతం పూర్వీకులు కట్టిన ఇంట్లోనే ఉంటుంది. నేను ఇల్లు కడదామని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. కానీ ఇప్పటి ఇసుక ధరలను చూస్తే భయం వేస్తున్నది. గతంలో సులభంగా ఇసుక లభించేది. ఇప్పుడా పరిస్థితి లేదు.
–గోపాల్, గ్రామస్తుడు, రొంపేడు, ఇల్లెందు మండలం

ఆన్‌లైన్ విధానం తీసేశాక అవస్థలు..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సులభంగా ఇసుక అందేది. కొత్త ప్రభుత్వం వచ్చాక ఆన్‌లైన్ విధానం రద్దయింది. దీంతో ఇండ్లు నిర్మించుకోవడం కష్టతరమైంది. ఇప్పుడు దళారులదే రాజ్యమైంది. వారు చెప్పిన ధరకే ఇసుక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంటి యజమానులు రెట్టింపు ధరలకు ఇసుక కొని ఇల్లు కట్టుకునే దుస్థితి ఏర్పడింది.
–ఆంగోతు అంజి, రైతు, సేవ్యాతండా, ఇల్లెందు

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

యానంబైలు ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న కొత్తగూడెం డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్

డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్‌కుమార్

పాల్వంచ రూరల్, మార్చి 19: పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కొత్తగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని యానంబైలు, ప్రభాత్‌నగర్ పంచాయతీలను మంగళవారం ఆయన సందర్శించి పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. గ్రామాల్లో నూరుశాతం పారిశుధ్య పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీవో బొగ్గా నారాయణ, పంచాయతీ కార్యదర్శులు దేవ్‌సింగ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 19: అన్నపురెడ్డిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలను ఈ నెల 23 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ పాకల వెంకటరమణ తెలిపారు. ఆలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25న రాత్రి 10 గంటలకు స్వామివారి తిరుకల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

టేకులపల్లి, మార్చి 19: కొప్పురాయి పంచాయతీ పరిధి లక్ష్మీపురం అభయాంజనేయస్వామి ఆలయ సన్నిధిలో మంగళవారం నిర్వాహకులు ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత

మణుగూరు టౌన్, మార్చి19: ఆదర్శనగర్‌కు డాక్టర్ సంజీవరావు ఇటీవల తన మొబైల్ పోగొట్టుకున్నారు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్సై ఎం.ప్రసాద్ అత్యాధునిక సాంకేతికత ద్వారా మొబైల్‌ను రికవరీ చేశారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో డాక్టర్ సంజీవరావుకు మొబైల్‌ను అప్పగించారు.

అడిషనల్ షీట్‌లో ఫస్ట్ డే టెన్త్ ఎగ్జామ్

- రెండో రోజు మెయిన్ ఆన్సర్ షీట్ ఇవ్వడంతో గుర్తించిన విద్యార్థులు
- బాధ్యులను విధుల నుంచి తొలగించిన అధికారులు

పాల్వంచ, మార్చి 19: పాల్వంచ కేటీపీఎస్ పదోతరగతి పరీక్షా కేంద్రంలో సోమవారం జరిగిన తప్పిదం మంగళవారం వెలుగు చూసింది. ఓ తరగతి గదిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఇన్విజిలేటర్ మెయిన్ జవాబు పత్రం ఇవ్వకుండా కేవలం అడిషనల్ పత్రాలపైనే పరీక్ష రాయించారు. తెలిసిన వివరాల ప్రకారం.. కేటీపీఎస్ ఉన్నత పాఠశాలలో సోమవారం మొదటి రోజు పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. రూమ్ నంబర్ 9లో తెలుగు పరీక్ష రాస్తున్న 24 మంది విద్యార్థులకు ఇన్విజిలేటర్ సరోజిని అదనపు జవాబు పత్రాన్ని ఇచ్చారు. దీంతో దానిపైనే వారు జవాబులు రాసి వెళ్లారు. మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు ఇదే గదికి వచ్చిన మరో ఇన్విజిలేటర్.. మెయిన్ జవాబు పత్రాన్ని విద్యార్థులకు ఇచ్చారు. దీంతో ఆశ్చర్యపోయిన విద్యార్థులు.. సోమవారం తమకు అదనపు జవాబు పత్రమే ఇచ్చారని ఇన్విజిలేటర్‌కు తెలిపారు. ఈ విషయాన్ని ఇన్విజిలేటర్ వెంటనే డిపార్టమెంటల్ అధికారికి తెలియజేశారు. ఆయన ద్వారా విషయం తెలుసుకున్న డీఈవో వెంకటేశ్వరచారి స్పందించి సోమవారం విధులు నిర్వర్తించిన ఇన్విజిలేటర్ సరోజినితోపాటు డిపార్ట్‌మెంటల్ అధికారి, చీఫ్ సూపరింటెండెంట్‌ను విధుల నుంచి తొలగించారు. దీనిపై ఎంఈవో శ్రీరామమూర్తిని వివరణ కోరగా.. తప్పిదం జరిగిన మాట వాస్తవమేనని, కానీ విద్యార్థులకు ఇబ్బంది ఉండదని సమాధానమిచ్చారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తహసీల్దార్

పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సరోజిని

చంద్రుగొండ, మార్చి 19: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంతో మండలంలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సంధ్యారాణి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకునేలా ర్యాంపులు ఉన్నాయా? లేవా? అనే అంశాలను పరిశీలించారు. సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. గిర్దావర్ అక్బర్, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

వినాయకపురం రామాలయంలో ప్రత్యేక పూజలు

రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 19: మండలంలోని వినాయకపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు రోజులుగా యాగశాలలో హోమాలు నిర్వహిస్తున్నారు.

సంపత్‌నగర్‌లో వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవం

స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

టేకులపల్లి, మార్చి 19: గంగారం పంచాయతీ పరిధిలోని సంపత్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణం జరిపించారు. వేడుకకు పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెండు గ్రామాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాలు

టేకులపల్లి, మార్చి19: సీడీపీవో తార మంగళవారం టేకులపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోయగూడెం, కొప్పురాయి గ్రామాల్లోని అంగన్‌వాడీల్లో పోషణ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం చేశారు. పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. సూపర్‌వైజర్ యశోద, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిన్ననల్లబెల్లిలో వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రేణుకారెడ్డి

పర్ణశాల, మార్చి 19: పర్ణశాల పీహెచ్‌సీ వైద్యాధికారి రేణుకారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది చిన్ననల్లబెల్లిలో వైద్యశిబిరం నిర్వహించారు. 62 మంది వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మెడిసిన్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌యూవో హనుమంతు, హెచ్‌ఈ శారద, పీహెచ్‌ఎన్ వెంకటనర్సమ్మ, హెచ్‌ఏ నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ నలంద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిత్యావసరాల పంపిణీ

పినపాక, మార్చి 19: సింగిరెడ్డిపల్లి పంచాయతీ మద్దులగూడెంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం హోప్ చారిటబుల్ సొసైటీ సభ్యులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, సొసైటీ సభ్యులు యోహాను, మణికుమార్, సుందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే పాయం సంతాపం

సూర్యం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న పాయం

బూర్గంపాడు, మార్చి 19: అంజనాపురానికి చెందిన మాజీ సర్పంచ్ తేజావత్ సూర్యం మంగళవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మృతుడి ఇంటికి వచ్చి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మోరంపల్లి బంజరలో పర్యటించారు. మృతుడు బిల్లా రాంబాబు కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి తొలి విడతలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జింకలగూడెంలో ఈద్గాహ్‌తో పాటు ఖబరస్థాన్, క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు.

నేడు ఓటు ప్రాధాన్యతా ర్యాలీ: తహసీల్దార్

రాఘవరెడ్డి

మణుగూరు టౌన్, మార్చి 19: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఓటు ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేందుకు పినపాక నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ఆధ్వర్యంలో మణుగూరు పట్టణంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పినపాక అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ రాఘవరెడ్డి తెలిపారు. మణుగూరులోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం సాయంత్రం పోలీస్, రెవెన్యూ శాఖలు కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్కడే మానవహారం, ఓటు ప్రతిజ్ఞ చేయనున్నట్లు వివరించారు.

'మణుగూరు డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.5 కోట్లు'

బీ.శ్రీనివాస్

మణుగూరు టౌన్, మార్చి19: మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి పనుల కోసం రూ.5 కోట్ల నిధులు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ప్రధాన మంత్రి ఉచ్చతర సర్వశిక్ష అభియాన్ పథకం ద్వారా ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో నూతన భవన నిర్మాణం, ల్యాబ్ భవన మరమ్మతులు, రోడ్లు, సెమినార్ హాల్, స్టోర్స్ సంబంధ పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

ప్రమాదవశాత్తూ కాలువలో పడి వ్యక్తి మృతి

దుమ్ముగూడెం, మార్చి 19: ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని డీ.కొత్తగూడేనికి చెందిన కారం తిరుపతిరావు (46) సొంత పనులపై బయటకు వెళ్లాడు. తిరిగి స్కూటీపై ఇంటికి వస్తున్న క్రమంలో సుబ్బారావుపేట వద్ద తాలిపేరు కాలువలో ప్రమాదవశాత్తూ పడి మృతిచెందాడు. ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్తున్న గ్రామస్తులు కాలువలో మృతదేహాన్ని చూసి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేశవ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కార్మికుల సమస్యలపై స్పందించాలని వినతి

భద్రాచలం, మార్చి 19: పంచాయతీ కార్మికుల సమస్యలపై స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల బకాయి వేతనాలు, కనీస వేతనం, బీమా తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

'మల్లు స్వరాజ్యానిది వీరోచిత పోరాటం'

భద్రాచలం, మార్చి 19: భూమి కోసం, భుక్తి కోసం, వ్యక్తి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మల్లు స్వరాజ్యానిది వీరోచిత పోరాటమని సీపీఎం నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ప్రజా పోరాటాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు.

'ప్రమాదకర రహదారికి మరమ్మతులు చేపట్టాలి'

లోయలాంటి గుంతను చూపిస్తున్న నేతలు

గుండాల, మార్చి 19: గుండాల – మణుగూరు ప్రధాన రహదారి మార్గంలో ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని ఏవీఎస్‌పీ నాయకులు కోరారు. సాయనపల్లి – దామరతోగు మధ్య రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని అన్నారు. సాయనపల్లి – రంగాపురం మార్గంలో సుమారు 35 కిలోమీటర్ల మేర ఉన్న మెటల్ రోడ్డు కూడా పూర్తిగా గుంతలమయం కావడంతో బస్సు ప్రయాణంలో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి ఈ మార్గాల్లో మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. నేతలు చంద్రయ్య, నరేందర్ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చక స్వామి

భద్రాచలం, మార్చి 19: భద్రాచలం సీ